## క్లుప్తంగా

### చౌడువాడలో అన్నసమారాధన



అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు

కె.కోటపాడు: చౌడువాడలో బ్రహ్మంగారి ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు నిర్వహించారు. బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో భాగంగా కార్తీకమాసం ముగింపు రోజున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చౌడువాడ, మల్లంపాలెం, పాచిలవానిపాలెం గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

### 130 మందికి నేత్ర పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్

గొలుగొండ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గొలుగొండలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 130 మంది రోగులను ఆప్తాలమిస్ట్ పరీక్షించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రోగులకు మందులు అందజేశారు. 15 మందిని కంటి శస్త్రచికిత్సల నిమిత్తం విశాఖకు తరలించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది, సర్పంచ్ కసిపల్లి బుజ్జి పాల్గొన్నారు.

### విద్యార్థులకు కంచాల పంపిణీ



విద్యార్థులకు కంచాలు అందిస్తున్న రాంబాబు

బుచ్చెయ్యపేట: కరక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు జెడ్పీటీసీ దొండా రాంబాబు బుధవారం కంచాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు యన్నెంశెట్టి నాయుడు తన సొంత నిధులతో సమకూర్చిన వీటిని 60 మందికి అందించారు. నాయకులు కోవెల ఈశ్వరరావు, గోశెట్టి శ్రీను పాల్గొన్నారు.

### ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి

నర్సీపట్నం: ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హెల్త్, గైనిక్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవి మాట్లాడుతూ అమ్మాయి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఆహారపు అలవాట్లతో ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. డాక్టర్ అపర్ణ మహిళల్లో వచ్చే గైనిక్ సమస్యలు గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

### ఈవీఎంఎస్ ఓటింగ్‌పై అవగాహన



సాగరంలో ఈవీఎంలో నమూనా ఓటు వేస్తున్న వైస్ ఎంపీపీ

మాడుగుల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. బుధవారం సాగరంలో ఈవీఎంఎస్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఈవీఎంఎస్ ఎలక్షన్ ఇన్‌చార్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటర్లతో నమూనా ఓటింగ్ వేసి అవగాహన కల్పించారు. డీటీ అప్పారావు, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ పూర్ణయ, సర్పంచ్ కోట్ని జయమ్మ, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం పాల్గొన్నారు.





ఇది కదా అభివృద్ధి



కంచుగుమల్లో చిన్నారులతో మమేకమై అక్షరాలు నేర్పుతున్న టీచర్ వరలక్ష్మి

# పోషణ.. ఆరోగ్య సంరక్షణ

అక్కడ చిన్నారులకు బొమ్మలు, చార్టుల సాయంతో బోధిస్తారు. కఠినమైన పదాలను ఆటపాటలతో పలికిస్తారు. తల్లి ప్రేమను పంచుతూ క్రమశిక్షణలో నడిపిస్తారు. విజ్ఞాన వికాసానికి నీతికథలు చెబుతారు. అంతేకాదు నిత్యం వీరితోపాటు గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తారు. వెరసి అంగన్‌వాడీ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.

**రోలుగుంట మండలం**

అంగన్‌వాడీ కేంద్రాలు: 60
సొంత భవనాలు : 31
అద్దె భవనాలు : 8
ప్రీ స్కూల్ చిన్నారులు : 522 మంది
7 నెలల నుంచి 3 ఏళ్లలోపు వారు : 1,120
గర్భిణులు: 221 మంది
బాలింతలు : 270 మంది



రోలుగుంట కేంద్రంలో అక్షరాలు నేర్పించి వినోదం పంచే చార్టులు

రోలుగుంట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పట్ల ప్రేమతో మెలుగుతూ వారికి బొమ్మలతో అక్షర పరిచయం చేస్తున్నారు. విభిన్న పద్ధతులతో బోధిస్తున్నారు. చార్టుల ద్వారా కఠినమైన పదాలు పలికించి వారికి చదువుపై ఆసక్తి పెంచి బడికి వెళ్లే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. బరువు, ఎత్తు ఆధారంగా వైద్య సిబ్బంది సూచనలతో ఆరోగ్య గణన, రక్తహీనత తెలుసుకుని వాటి మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుని ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తున్నారు.

**అంగన్‌వాడీ మెనూ**

- సోమ, గురువారాల్లో వేడి అన్నం, వెజిటబుల్ కర్రీ, సాంబారు, కోడిగుడ్డు, 100 మి.లీ. పాలు
- మంగళ, శుక్రవారాల్లో పౌష్టికాహారంతో పాటు తోటకూర పప్పు, కోడిగుడ్డు, 100 మి.లీ. పాలు
- బుధ, శనివారాల్లో వెజిటబుల్ రైస్, పులిహోర, గోంగూర కూర, కోడిగుడ్డు, 100 మి.లీ..
- వారంలో కనీసం రెండు రోజులు మునగాకు తప్పనిసరి.

**బాలింతలు, గర్భిణులకు అందించే సరకులు**

| సరకులు | సంపూర్ణ పోషణ | సంపూర్ణ పోషణ ప్లస్ |
|---|---|---|
| రాగిపిండి | 2 కిలోలు | 1 కిలో |
| అటుకులు | 1 కిలో | 2 కిలోలు (మల్టీగ్రెయిన్ ఆటా) |
| బెల్లం | పావు కిలో | అర కిలో |
| వేరుశనగ చిక్కీ | పావు కిలో | అర కిలో |
| ఎండు ఖర్జూరం | పావు కిలో | అర కిలో |
| ఫోర్టిఫైడ్ బియ్యం | 3 కిలోలు | 3 కిలోలు |
| పప్పు | 1 కిలో | 1 కిలో |
| వంట నూనె | అర లీటర్ | అర లీటర్ |
| కోడి గుడ్లు | 25 | 25 |
| పాలు | 5 లీటర్లు | 5 లీటర్లు |



బుచ్చింపేటలో అంగన్‌వాడీ కేంద్రం

- చిన్నారులకు మెరుగైన బోధన
- నాణ్యమైన పౌష్టికాహారం
- అండగా నిలుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు

### కేంద్రాల నిర్వహణ బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ బాగుంది. మా ఇంటికి వచ్చి పాపను కేంద్రానికి తీసుకెళ్లి ఉదయం నుంచి సాయంత్రం ఆలనాపాలన చూస్తున్నారు. ఆటపాటలు నేర్పిస్తూ ఎంతో మానసికంగా ఆరోగ్యంగా చైతన్యపరచడం ఆనందంగా ఉంది.

– ఎస్.వెంకటలక్ష్మి, పాపంపేట గ్రామం, కొంతలం పంచాయతీ, రోలుగుంట మండలం

### మెరుగైన సంరక్షణ



ఇంటి వద్ద మా బాబు పేచీ భరించలేకపోయేదాన్ని. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన దగ్గర నుంచి క్రమశిక్షణ అలవడింది. తోటి వారితో ఆనందంగా ఆడుకుంటున్నాడు. వాడికి విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు ఇస్తున్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

– షేక్ నసీం, చిన్నారి తల్లి, రోలుగుంట, గ్రామం, మండలం

## ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: క్రీడా పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. స్థానిక జెడ్పీ హైస్కూల్(తురకబడి)లో విద్యార్థులతో కలిసి ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఈ నెల 15 నుంచి జనవరి 21వ తేదీ వరకు వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో 15 ఏళ్లు పైబడిన క్రీడాకారులంతా పాల్గొని సత్తా చాటాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి నర్సీపట్నం నియోజకవర్గానికి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ ప్రెసిడెంట్ ఏకా శివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, ఉపాధ్యాయులు, ఐఎస్‌ఆర్, విద్యార్థులు పాల్గొన్నారు.

**యువతీ, యువకులు క్రీడల్లో ప్రతిభ చూపాలి**

కె.కోటపాడు: ఆడుదాం...ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత ప్రతిభ చాటాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ కోరారు. మండలంలో 22 సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం...ఆంధ్రా క్రీడా పోటీల సామగ్రిని బుధవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, సత్యనారాయణ, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రామునాయుడు, ప్రశాంత్, భీమరాజు, సౌజన్య, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల వాచ్‌ఉమన్ మృతికి సంతాపం



చిలుకమ్మ కుటుంబానికి సాయమందిస్తున్న ప్రిన్సిపాల్

రావికమతం: కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నైట్ వాచ్‌ఉమన్‌గా పనిచేస్తున్న ఎద్దు చిలుకమ్మ(52) బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందింది. మంగళవారం యథావిధిగా దైనందిన కార్యక్రమాలు చేసుకుని నిద్రపోగా, తెల్లవారు ఆమెలో చలనం లేకపోవడంతో మృతి చెందినట్టు కుటుంబీకులు నిర్ధారించారు. భర్త, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆమె కుటుంబాన్ని పరామర్శించి దహన ఖర్చులకు గాను ఆర్థిక సాయమందించారు.

## దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్లు అందిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: దివ్యాంగ విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని కల్పించేలా వారి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ కోరారు. అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. క్రీడా పోటీల్లో విజేతలైన దివ్యాంగ విద్యార్థులకు శృంగవరం ఉపాధ్యాయుడు మొహిద్దీన్ సమకూర్చిన బహుమతులు ప్రదానం చేశారు. మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి, ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

**ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి**



మాకవరపాలెం: ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవోలు మూర్తి, లక్ష్మి

మాకవరపాలెం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవోలు లక్ష్మి, మూర్తి సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, పథకాలను తల్లిదండ్రులకు వివరించారు. దివ్యాంగులపై చిన్నచూపు చూడకుండా ఆదరించాలన్నారు. రెండు రోజులుగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఇద్దరు దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. భవిత కో ఆర్డినేటర్ మంగ, హెచ్‌ఎం జి.గడ్డినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతాం

- కొత్తవీధి రోడ్డు విస్తరణ ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్



కొత్తవీధి రోడ్డు విస్తరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీని మోడల్ తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. కొత్తవీధి రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నర్సీపట్నాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో భాగంగా మెయిన్‌రోడ్డును వందడుగులకు విస్తరిస్తున్నామన్నారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి మెయిన్ రోడ్డుకు కలుపుతూ ప్రత్యామ్నాయ రోడ్డును విస్తరిస్తున్నామన్నారు. దీంతోపాటు సెంట్రల్ లైటింగ్, డివైండర్ సుందరీకరణ చేస్తామన్నారు. మరో రూ.6 కోట్లతో కొత్తవీధి రోడ్డును విస్తరిస్తున్నామన్నారు. ఈ రెండు నిర్మాణ పనులు పూర్తయితే పట్టణ రూపురేఖలు మారుతాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, పార్టీ నాయకులు బేతిరెడ్డి విజయ్, ఎల్లేటి శ్రీను, డీఈ నారాయణ పాల్గొన్నారు.

## జెండర్ రిసోర్స్ సెంటర్ ఏర్పాటు



మహిళల సమస్యలపై సూచనలిస్తున్న అధికారులు

రావికమతం: మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో వెంకన్నబాబు, వెలుగు ఏపీఎం తిలక్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు విశాలాక్షి పాల్గొన్నారు. గ్రామీణ మహిళలు ఎదుర్కొనే వరకట్నం, బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్‌పై సమస్యలపై ఇక్కడ సెంటర్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. మండల అధికారుల బృందం వాటిని పరిష్కరిస్తుందని, కాని పక్షంలో తగిన చర్యలు చేపట్టి రక్షణ కల్పిస్తుందన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఏడీఏ శ్రీదేవి



నర్సీపట్నం: తడిసి, మొలకెత్తిన ధాన్యాన్ని ఏడీఏ శ్రీదేవికి చూపుతున్న రైతులు

నర్సీపట్నం: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు శ్రీదేవి రైతులకు హామీ ఇచ్చారు. మండలంలో దుగ్గాడ, పెదబొడ్డేపల్లి గ్రామాల్లో తుఫాన్‌కు నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను బుధవారం ఆమె క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. బాగా తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని రైతులు ఏడీఏకి చూపించారు. మండలంలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి మేలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఏఈవో శ్రీహరి, వ్యవసాయ గ్రామ సహాయకురాలు నీలవేణి పాల్గొన్నారు.

**18 వరకు పంట నష్టం నమోదు**



మాకవరపాలెం: సమావేశంలో మాట్లాడుతున్న ఏవో చిరంజీవి

మాకవరపాలెం: పంట నష్టంపై ఈ నెల 18 వరకు నమోదు చేస్తున్నట్టు ఏవో చిరంజీవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 నుంచి 22వ తేదీ వరకు ఆర్బీకేల్లో వాటి జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. వాటిని పరిశీలించి రైతులు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల: తుపానుకు నేలకొరిగిన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నట్టు ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. మండలంలో 23 సచివాలయ పరిధిలో పంట నష్టం లెక్కింపును గ్రామ కమిటీలో ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారన్నారు.

## పేద కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు

గ్రామాల్లో విస్తృతంగా ‘వై ఏపీ నీడ్స్ జగన్’



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గిరిబాబు

కె.కోటపాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. బుధవారం గొండుపాలెంలో వై ఏపీ నీడ్స్ జగనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమం, గ్రామాభివృద్ధికి మంజూరైన నిధుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీవో ప్రసాద్, సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, బండారు లక్ష్మణరావు, జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

గొలుగొండ: పాకలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ మాట్లాడుతూ 2019లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన సీఎం జగన్‌ను మరలా గెలిపించుకోవాలని కోరారు. సర్పంచ్ రాజాన పద్మ, ఎంపీటీసీ యాళ్ల లక్ష్మిదుర్గ పాల్గొన్నారు.

మాడుగుల: పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దపు భాస్కరరావు ఆధ్వర్యంలో ఒమ్మలిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి 35 కోట్ల 82 లక్షల 26 వేల 781 రూపాయలు వెచ్చించామని వైస్ ఎంపీపీ టీవీ రాజారామ్ తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, నాయకులు గూడెపు హరికృష్ణ, కాత వెంకటరమణ పాల్గొన్నారు.

దేవరాపల్లి: ముషిడిపల్లి సచివాలయంలో సర్పంచ్ మతల దేముడమ్మ అధ్యక్షతన ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును, పార్టీ జెండాను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు ఆవిష్కరించారు. రాత్రికి పల్లె నిద్ర చేశారు. సర్పంచ్ గంధం రామకృష్ణ, ఎంపీటీసీ బొడ్డు లక్ష్మీ, పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు కర్రి సూరినాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, ఉప సర్పంచ్ యండపల్లి శివ పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సంక్షేమ అభివృద్ధికి కృషి

దేవరాపల్లి: ఆర్య వైశ్యుల సంక్షేమ అభివృద్ధికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఎల్లప్పుడూ కృషి చేస్తారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఉమ్మడి విశాఖ జెడ్పీ స్త్రీశిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ అన్నారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం దేవరాపల్లిలో కార్తీక వనసమారాధనలో ఆమెతోపాటు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆర్య వైశ్య కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి. సింహాచలంనాయుడు, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.


## వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి ఘన నివాళి

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పడాల సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అన్నారు. బుధవారం ఎం. కోడూరులో సత్యనారాయణ సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టరు గొల్లవిల్లి ప్రభావతి, పార్టీ మండలాధ్యక్షుడు టి.వి.రాజారామ్, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేశ్, నాయకులు పడాల అప్పలనాయుడు, మూర్తి, అప్పలనర్సయ్య పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా సాయం అందజేత

దేవరాపల్లి: పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అన్నారు. దేవరాపల్లిలో అనారోగ్యంతో మరణించిన వాలేటి అప్పారావుకు రూ.లక్ష రూపాయలు మంజూరైంది. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు మృతుడి కుమారుడు సురేష్‌కు బుధవారం అందజేశారు. శెట్టి బలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సిమ్మ అప్పన్న, పంచాయతీ సెక్రటరీ ఎస్. శ్రీనివాసరావు, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాల పంపిణీ



హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న వైస్ చైర్మన్ రామకృష్ణ, కౌన్సిలర్లు

నర్సీపట్నం: మున్సిపాలిటీ 2వ వార్డు బీసీ కాలనీలో 120 మంది లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రాలను మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ లబ్ధిదారుల 40 ఏళ్ల నాటి కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరిందన్నారు. కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, పార్టీ నాయకులు సిరసపల్లి వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుల రక్తదానం

నర్సీపట్నం: ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవి ప్రారంభించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివాజీతోపాటు 26 మంది యువతీ యువకులు రక్తదానం చేశారు. నాయకులు రమణ, గీతాకృష్ణ, రమణ, మణికంఠ, స్వామి పాల్గొన్నారు.